క్లుప్తంగా

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ



అక్కివరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది, తదితరులు

డెంకాడ: అవగాహనతో హెచ్ఐవీని నివారించవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఎం.శివరామకృష్ణ అన్నారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అక్కివరం గ్రామంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ.. లైంగిక కలయిక, సురక్షితం కాని రక్తమార్పిడి వల్ల హెచ్ఐవీ సంక్రమించే అవకాశం ఉందన్నారు. వ్యాధి సోకకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.భాస్కరరావు, పీపీఎస్ నాగమణి, ఎస్.సౌజన్య, పి.మాధవ, వి.ఉత్తరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



చింతలవలస జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బంది

డెంకాడ: నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్సై ఎ.సన్యాసినాయుడు తన సిబ్బందితో కలిసి చింతలవలస జంక్షన్ వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టి, ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలించారు. మందు, గంజాయి, గుట్కా వంటి నిషేధిత వస్తువులు రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక సాయం



పైడిశెట్టి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ప్రెసిడెంట్ చింతపల్లి శ్రీనివాసరావు, యూనియన్ సభ్యులు

భోగాపురం: మండలంలోని రాజాపులోవ గ్రామానికి చెందిన పైడిశెట్టి నాతవలస టోల్ ప్లాజాలో కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న కార్మికులందరూ కలిసి మృతిని కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి, రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్మికుల యూనియన్ ప్రెసిడెంట్ చింతపల్లి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, ఇన్‌చార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

దొంగల బీభత్సం



ఓ ఇంటిలో దొంగలు తెరిచిన బీరువా

విజయనగరం క్రైమ్ : తోటపాలెం వైఎస్సార్ నగర్‌లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు బీభత్సం సృష్టించారు. తలుపులు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని తాళాలు విరగ్గొట్టి బీరువా తలుపులు పగలగొట్టి, నగదు, బంగారు ఆభరణాలు అపహరించకపోయారు. బుధవారం ఉదయం స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సుమారు నాలుగు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి పలు ఆధారాలు సేకరించింది.

రేపటి నుంచి ప్రత్యేక గ్రామసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల: ఈ నెల 23 నుంచి ఉపాధి హామీ పథకం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ జి. గిరిబాల సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామసభల్లో 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై చర్చించాలని సూచించారు. ప్రాధాన్యం గల పనులను గుర్తించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో ఏపీఓ జి. అరుణకుమారి, మండల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం..

- గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం
- నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం 25, 710 ఎకరాలు
- ఇప్పటివరకు సాగులో ఉంది 9,350 ఎకరాలు



కొప్పెర్ల సమీపంలో వర్షాభావంతో ఉబాలు చేయని పొలాలు

పూసపాటిరేగ : వర్షాభావ పరిస్థితులతో నెల్లిమర్ల నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. భారీ వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ పనులు నెమ్మదించాయి. పంటల సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పడిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటల సాగు విస్తీర్ణం సుమారు 25,710 ఎకరాలు కాగా.. అందులో ఇప్పటివరకు కేవలం 9,350 ఎకరాల్లో మాత్రమే సాగు పనులు జరిగాయి. ఇంకా 14,360 ఎకరాలలో సాగు చేయాల్సి ఉంది. ఏటా వరి సాగు సుమారు 16,000 ఎకరాలలో చేపడతారు. కాని ఇప్పటివరకు కేవలం 7,850 ఎకరాలలో మాత్రమే వరి నాట్లు వేశారు. వరినారు మడులలో వేశాక 25 రోజులలో నాట్లు వేయాలి. కానీ ఇప్పటివరకు 30 రోజులు దాటినా కొన్నిచోట్ల వర్షాలు కురవకపోవడంతో నారు మడులు ఎండిపోతున్నాయి. మరి కొన్ని చోట్ల వరినారు మడుల్లోనే ముదురుపోతున్నాయి. దీంతో గత్యంతరం లేక కొన్ని చోట్ల వరి నారుమడులను కొత్తగా పోస్తున్నారు. బోర్లు, చెరువుల ఆయకట్టు భూముల్లో మాత్రమే రైతులు ధైర్యం చేసి వరి నాట్లు వేస్తున్నారు. నాట్లు వేసిన తర్వాత అయినా వర్షాలు కురుస్తాయన్న ఆశాభావంతో సాగు చేస్తున్నామని , వరుణుడు కరుణించకపోతే మొత్తం పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు వారాలలో వరినాట్లు పూర్తయితేనే ఆశించిన స్థాయి దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పుడిప్పుడే వరినాట్లు కొంతవరకు ఊపందుకుంటున్నాయని తెలిపారు.

ప్రశ్నార్థకంగా ఖరీఫ్ సాయం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటింది. ఈ సీజన్‌లో రైతులు ప్రధానంగా వరి ఎక్కువగా సాగు చేస్తారు. గత ఐదేళ్ల అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుభరోసా కింద సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందజేసింది. దీంతో అన్నదాతలు ఏ ఇబ్బందులు లేకుండా సాగు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సాయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారంలోకి వస్తే 20 వేల రూపాయల పెట్టుబడి సాయం చేస్తామని ప్రకటించిన చంద్రబాబు ఆ దిశగా చర్యలేవీ తీసుకోకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు సన్న, చిన్నకారు రైతులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద ప్రభుత్వ సాయం రైతుల బ్యాంక్ ఖాతాలలో జమయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెలలు గడుస్తున్నా రూపాయి కూడా విదల్చకపోవడంతో అప్పులు చేసి మరీ వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

వర్షాల్లేక వరి నారుమడులు ఎండిపోయేలా ఉన్నాయి. పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వం నుంచి సాయం అందకపోతే ఇక సాగు చేయలేం. ప్రైవేట్ వ్యాపారుల నుంచి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ అధికారులు, పెద్దలు రైతులను ఆదుకొనే దిశగా చర్యలు చేపట్టాలి.

– కె. వెంకటరావు , రైతు పూసపాటిరేగ

వరి నారు ఎండిపోతోంది..

చాలా గ్రామాలలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి నారుమడులు ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల వరినారు ముదురు పోయింది. జూన్, జూలై నెలలో అధికా వర్షపాతం నమోదైంది. ప్రధానంగా వర్షం అవసరమైన ఆగస్టు నెలలో వర్షం పడకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

– మైపాడ రామునాయుడు, రైతు పతివాడ

సేవానిరతి ప్రశంసనీయం



మృతి చెందిన రామకృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

విజయనగరం: పూర్వ విద్యార్థి సంఘాల సేవానిరతి ప్రశంసనీయమని స్థానిక మహారాజా కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధి పేర్ల సీతారామయ్య శెట్టి అన్నారు. పట్టణంలోని ఉల్లివీధిలో ఉన్న ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందిన రామకృష్ణ కుటుంబానికి మహారాజ కళాశాల 1976 – 79 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.32,500 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో మహారాజ కళాశాల పూర్వ సహవిద్యార్థులు వివేక్, వారణాసి సుధాకర్, కాపుగంటి ప్రకాష్, గ్రంధి ముత్యాలరావు , శేఖర్, బూర సత్యనారాయణ, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

- వచ్చే నెల 5 నుంచి అమలుకు శ్రీకారం
- ప్లాస్టిక్ విక్రయదారులతో కార్పొరేషన్ కమిషనర్ సమావేశం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయనున్నామని, వచ్చే నెల 5 నుంచి కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించే వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో తక్షణమే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయనున్నట్లు చెప్పారు. దీనికి వ్యాపారులు స్పందిస్తూ ఇప్పటికే తమవద్ద ఉన్న ప్లాస్టిక్ సరుకులు అమ్ముడయ్యేంతవరకు కొంత సమయం కావాలని కోరారు. ఇందుకోసం 15 రోజుల సమయం ఇస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీ తర్వాత ఎవ్వరు ప్లాస్టిక్, పాలిథిన్ ఉత్పత్తులు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 120 మైక్రాన్ల మందం కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్, పాలిథిన్ ఉత్పత్తులను నిషేధిస్తున్నట్లు స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని.. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

భారత్ బంద్ ప్రశాంతం



తంగుడుబిల్లి పాఠశాల హెచ్ఎమ్‌కు బంద్ నోటీసు అందజేస్తున్న ఎయిమ్ నాయకులు

నెల్లిమర్ల రూరల్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించిన భారత్‌బంద్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. సతివాడ, బొప్పడాం , ఒమ్మి, రామతీర్థం, అలుగోలు, తదితర పాఠశాలల వద్ద మండల ఎయిమ్ నాయకులు తమ నిరసనను తెలియజేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బంద్ నోటీసులు ఇచ్చి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో బూసరి అప్పలరాజు, బోడసింగి జయరాజు, అలుగోలు మాలచ్చి, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి..



ఆందోళన చేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది

నెల్లిమర్ల: సీహెచ్‌సీకి సంబంధించిన పారిశుధ్య, సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న తమకు వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని పలువురు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక సీహెచ్‌సీ వద్ద జీతాలు చెల్లించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, ఐదు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. నిరసనలో పలువురు పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది సీహెచ్ భారతి, బి. రాము, మల్లేశ్వరమ్మ, వాణీ, శ్రీను పాల్గొన్నారు.

ట్రస్టులు, ఆశ్రమాల్లో నిబంధనలు పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ నోడల్ అధికారి విజయకుమారి

చీపురుపల్లి: అనాథ పిల్లలు, పేద పిల్లలకు ఆశ్రయమిస్తున్న చారిటబుల్ ట్రస్టులు, ఆశ్రమాల్లో నిబంధనలు పాటించాలని ఐసీడీఎస్ నోడల్ అధికారి విజయకుమారి చెప్పారు. స్థానిక రామాంజనేయ కాలనీలోని హోమ్ ఫర్ బాయ్స్, గర్ల్స్ సంస్థలో బుధవారం ఆమె తనిఖీలు చేశారు. ఇక్కడ ఎంత మంది పిల్లలు ఉన్నారు, ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారో లేదో పరిశీలించారు. అనంతరం నిర్వాహకులతో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నా రు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుతూ వండిన పదార్థాలపై మూతలు పెట్టాలన్నారు. ఆమె వెంట స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి పీఓ జె.పైడిమంగమ్మ తదితరులు ఉన్నారు.

విజయనగరం డీఎస్పీగా చిట్టిబాబు

విజయనగరం క్రైమ్: విజయనగరం డీఎస్పీగా ఐ.చిట్టిబాబును నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఎస్పీ 5వ బెటాలియన్‌లో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న చిట్టిబాబును విజయనగరం టౌన్ డీఎస్పీగా బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది డీఎస్పీలను బదిలీ చేశారు. ఇప్పటివరకు విజయనగరం డీఎస్పీగా పనిచేసిన గోవిందరావును పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు.

మహారాజా కళాశాలలో 'జనంలోకి మనం'

విజయనగరం టౌన్: మహారాజా కళాశాల సెమినార్ హాల్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్ సహకారంతో డాక్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 'జనం లోకి మనం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడతాయో ఏఎస్పీ సుందరనాయుడు వివరించారు. తపాలా శాఖలో పొదుపు బంగారు భవిష్యత్‌కు మార్గమన్నారు. కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ సతీష్, పీఆర్ఐఈ మధు, మహారాజా కళాశాల తరఫున సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీస్‌లు

శృంగవరపుకోట: అక్రమ రవాణా, విక్రయాల కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన మద్యం బాటిళ్లను బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలోఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.వి.జి.రాజు నేతృత్వంలో బుధవారం ధ్వంసం చేశారు. 43 కేసుల్లో సీజ్ చేసిన 633 మద్యం బాటిళ్లను ధ్వంసం చేశామని ఎస్.కోట సీఐ వి.ఎన్.మూర్తి తెలిపారు. స్థానిక ఎస్ఐ గంగరాజు, హెచ్‌సీ రామకృష్ణ, వీఆర్ఓ కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ వద్ద ఉన్న మెర్సీ మిషన్‌లోని బాలురు, బాలికల హోమ్‌ను ఐసీడీఎస్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఐసీడీఎస్ నోడల్ అధికారి విజయకుమారి, ఎల్‌సీపీఓ కె.జయలక్ష్మి, ఓఆర్‌డబ్ల్యూ కె.అప్పారావు, తదితరులు హోమ్‌ను సందర్శించి, అక్కడి పరిస్థితిని పరిశీలించారు. మెనూ, పిల్లల ఆరోగ్య పరిస్థితులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం



ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత వెంకట సూరిబాబు

చీపురుపల్లి: స్థానిక కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి మండలంలోని రేగిడిపేటకు చెందిన యలకల వెంకటసూరిబాబు, దేవి దంపతులు రూ.51,003 ఆర్థిక సహాయం చేశారు.నగదును ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు రేగిడిపేటలోని తమ నివాసం వద్ద దాతలు బుధవారం అందజేశారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్. వి.జి. శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్ ధనూకా, గుడ్ల శ్రీను, ఒమ్మి రమేష్, ఉమామహేశ్వరరావు, పీతల మురళి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న కోచ్, తదితరులు

చీపురుపల్లి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చీపురుపల్లి-గరివిడి పట్టణాల మధ్య ఉన్న రాయల్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న పట్టణానికి చెందిన పలువురు పతకాలు సాధించారు. విశాఖపట్టణంలో ఈనెల18న విశాఖ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన సాకేటి రేణుక 84 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించింది. అలాగే బెంచ్ ప్రెస్ విభాగం 255 కేజీల కేటగిరీలో కూడా ప్రథమస్థానం దక్కించుకుంది. పవర్ లిఫ్టింగ్‌లో పురుషుల 93 కేజీల విభాగంలో పట్టణా నికి చెందిన కె.శ్రీఖర్ రజత పతకం సాధించాడు. వీరిని బుధవారం జిమ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోచ్ దుర్గాప్రసాద్, జిమ్‌లో శిక్షణ పొందుతున్న యువకులు అభినందించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని నెల్లిమర్ల మాజీ శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన మొంగం రాంబాబు కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి జనార్దనరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా పారిశ్రామికవేత్తల దినోత్సవం



సత్కారం పొందుతున్న ముఖ్య అతిథి ప్రొఫెసర్ కేఎస్ఎస్ రామరాజు

విజయనగరం అర్బన్: స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ప్రొఫెసర్ కేఎస్ఎస్ రామరాజు మాట్లాడుతూ.. సమాజాన్ని మెరుగుపరిచే ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌లు నిర్వహించగల విద్యార్థులు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథిని నిర్వాహకులు సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, డీన్ డాక్టర్ వై.నరేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటలక్ష్మి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవికిశోర్, మేనేజ్‌మెంట్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రవికుమార్, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



రాకోడులో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం: మండలంలోని రాకోడు గ్రామంలో దోమల నివారణపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మురుగునీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీహెచ్‌ఓ మాణిక్యం, సిబ్బంది రాముడమ్మ, సూపర్‌వైజర్లు శ్రీరామమూర్తి, శ్రీను, కళావతి, హెల్త్ అసిస్టెంట్ చిన్నారావు, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.